
ప్రజాశక్తి
ఆదివారం 7 సెప్టెంబర్ 2025
5
పార్వతీపురం మన్యం



15న రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - సీతంపేట

ఈనెల 15న స్థానిక ఐటిడిఎలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ప్రాజెక్టు అధికారి పవార్ స్వప్నిల్ జగన్నాథ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మెగా రక్తదాన శిబిరం పాలకొండ ప్రాంతీయ ఆసుపత్రి వారి ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. 15న 10 గంటలకు సీతంపేట ఐటిడిఎలోని ఎస్.ఆర్.శంకరన్ మీటింగ్ హాల్ ఆవరణలో నిర్వహించబడును. ఈ మెగా రక్తదాన శిబిరంలో ఐటిడిఎ పరిధిలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఐటిఐ కళాశాల విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది, గిరిజన యువత, ప్రజలు అందరూ పాల్గొని రక్తదానం చేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. వివరాలకు 9392917704, 8790410073 ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని పిఒ తెలిపారు.

ఎరువుల అక్రమ రవాణా

- సీజ్ చేసిన విజిలెన్స్ అధికారులు
- కేసలి పిఎసిఎస్ నుంచి తరలింపు
- టిడిపి నాయకుడే సూత్రధారి

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఒకవైపు ఎరువుల కోసం రైతులు అల్లాడిపోతున్న సమయంలో ఓ టిడిపి నాయకుడు, పిఎసిఎస్ అధ్యక్షుడు దర్జాగా ఎరువులను అక్రమంగా రవాణా చేస్తున్న ఆటో శనివారం విజిలెన్స్ అధికారులకు దొరికిపోయింది. పాచిపెంట మండలం పి.కోనవలస చెక్ పోస్ట్ వద్ద విజిలెన్స్ అధికారులు, వ్యవసాయ అధికారి తనిఖీలు చేస్తుండగా పాచి పెంట వైపు నుంచి ఆటోలో ఎరువుల తరలింపు వారి కంట పడింది. వెంటనే అధికారులు ఆటోలో ఉన్న ఎరువులను పరిశీలించగా వాటికి ఏ విధమైన పత్రాలు లేకపోవడంతో సీజ్ చేశారు. పాచిపెంట మండలం లోని కేసలి పిఎసిఎస్ నుంచి 11 యూరియా, 3 పొటాష్ బస్తాలను ఆటోలో తరలిస్తుండగా పి.కోనవలస చెక్‌పోస్ట్ వద్ద విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. అధికారులు పట్టుకున్న తర్వాత కేసలి పిఎసిఎస్ అధ్యక్షులు మాదిరెడ్డి మధ్యారావు అక్కడికి చేరుకుని ఆ ఎరువులు తనవేనని, పొలానికి తీసుకెళ్తున్నట్లు చెప్పారు. అయితే ఆ బస్తాలకు సంబంధించిన బిల్లులు చూపించాలని అధికారులు కోరగా ఆయన చూపించ లేకపోయారు. దీంతో విజిలెన్స్ అధికారులు సీజ్ చేసిన ఎరువులను మండల వ్యవసాయ అధికారి కె.తిరుపతి రావుకు అప్పగించారు. ఆయన ఎరువులను సమీపంలో ఉన్న పి.కోనవలస రైతు సేవా కేంద్రానికి తరలించారు. అయితే ఈ ఎరువులను పిఎసిఎస్ అధ్యక్షులు ఆటోలో సాలూరు వైపు పంపిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. యూరియా కొరత తీవ్రంగా ఉన్న సమయంలో ఎలాంటి బిల్లులు లేకుండా అధికారపార్టీకి చెందిన నాయకుడు ఇలా తరలించడం వివాదాస్పదమవుతోంది. కేసలి పిఎసిఎస్‌కి యూరియా ఇటీవల పంపిణీ కావడంతో అధ్యక్షుడు మధ్యారావు తన పలుకుబడి ఉపయోగించి తరలించేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే సరిపడా యూరియా సరఫరా కాకపోవడంతో రైతులు ప్రయివేటు వ్యాపారుల వద్ద అధిక ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. ఎరువుల కొరత దృష్ట్యా ప్రభుత్వం ప్రయివేటు డీలర్లకు సరఫరా చేయకుండా పిఎసిఎస్‌లు, రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేస్తున్నారు. ఇటీవల పిఎసిఎస్‌లకు నూతన అధ్యక్షులు నియామకం జరిగింది. దీంతో ఎరువుల పంపిణీపై సొసైటీ బాస్‌ల పెత్తనం పెరిగింది. రైతు సేవా కేంద్రాలు కూడా స్థానిక టిడిపి నాయకుల కనుసన్నల్లో పని చేస్తున్న పరిస్థితి ఏర్పడింది. తాజా పరిస్థితుల్లో జిల్లాలో సరఫరా అయిన ఎరువులు పక్కదారి పడుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాలూరు నియోజకవర్గం నుంచి పి.కోనవలస చెక్ పోస్ట్ దాటుకుని పెద్ద ఎత్తున ఎరువులు ఒడిశా వైపు తేలిపోతున్నాయినే ప్రచారం జరుగుతోంది.



ఆటోలో ఉన్న ఎరువులను సీజ్ చేసిన అధికారులు

అనంతరం విజిలెన్స్ సిఐ సింహాచలం, వ్యవసాయ అధికారి కె తిరుపతి రావు కేసలి పిఎసిఎస్‌కి వెళ్లి రికార్డు లను తనిఖీ చేశారు. సొసైట పై 6ఎ కేసు నమోదు చేశారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో స్టాక్ ఉన్న 155 బస్తాల పొటాష్‌ను సీజ్ చేశారు. తదుపరి ఉత్తర్వులు జారీ చేసేంత వరకు ఈ ఎరువులను విక్రయించరాదని ఆదేశించారు. ఇదిలా ఉండగా పి.కోనవలస చెక్ పోస్ట్ వద్ద ఎరువులతో వెళుతున్న ఆటో ని సీజ్ చేసిన సమయంలో ఓ కీలక టిడిపి నేత విజిలెన్స్ సిఐకి ఫోన్ చేసి ఎరువులను వదిలేయాలని ఒత్తిడి చేసే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. అయితే సిఐ తమ విధులకు ఆటంకం కలిగించొద్దని వాదించడంతో ఆ నేత ఏమీ చేయలేని పరిస్థితిలోకి వెళ్లారు.

అమెరికా టారిఫ్‌లను రద్దు చేయాలి

●వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల డిమాండ్ ●ఆర్టిసి కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో

ప్రజాశక్తి - పార్వతీపురం

అన్ని ఒప్పందాలను ధిక్కరించి అమెరికా నుంచి దిగుమతి అయ్యే మన సరుకులపై భారీగా ట్రంప్ పన్నులు పెంచేశాడని, ఇది మోడీ ప్రభుత్వం అసమర్థతకు నిదర్శనమని వామపక్ష రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులు విమర్శించారు. ఇండియాపై అమెరికా దౌర్జన్యాన్ని, పెంచిన సుంకాలను వ్యతిరేకిస్తూ వామపక్ష, ప్రజాసంఘాల ఆధ్వర్యాన రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శనివారం స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ కూడలి వద్ద రాస్తారోకోతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భారతీయ సరుకుల దిగుమతులపై సుంకాన్ని 50 శాతానికి పెంచడంతో మన ఉత్పత్తులపై తీవ్ర ప్రభావం పడిందన్నారు. ఈ పన్నుల పెంపు వల్ల మన దేశం నుంచి పత్తి ఎగుమతి కాలేదని, అమెరికా నుంచి పత్తి దిగుమతి అయితే ఇప్పటికే మద్దతు ధర లేక ఆత్మహత్య చేసుకుంటున్న మన రైతులకు ఇది మరణ శాసనమేనని, మొక్కజొన్న రైతులకు ఇదే పరిస్థితి అని అన్నారు. ఆక్వా, టెక్స్ టైల్స్, గార్మెంట్స్ వంటి ఉత్పత్తుల ధరలు ఘోరంగా పడిపోయాయని, దేశ సముద్ర ఉత్పత్తుల్లో 40 శాతం ఎగుమతులు ఆంధ్రప్రదేశ్ నుంచే అవుతున్నాయని తెలిపారు. ఏటా సుమారు 2 వేల కోట్ల డాలర్ల విలువైన ఆక్వా ఉత్పత్తుల ఎగుమతుల్లో మన రాష్ట్రం నుంచి రొయ్యల ధరలు ఘోరంగా పడిపోవడంతో సముద్ర తీర ప్రాంతాల్లోని రొయ్యలు, చేపల రైతులు తీవ్ర సంక్షోభంలో చిక్కుకున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. అలాగే రాష్ట్రంలో ఫ్యాక్టరీలు, స్పిన్నింగ్ మిల్లుల్లో పని చేస్తున్న వేలాది మంది కార్మికుల ఉపాధికి ఎసరు వస్తోందని ఇందులో అత్యధికులు మహిళా శ్రామికులు కావడం గమనార్హమని చెప్పారు. మన ఎగుమతులపై సుంకం పెంచి మరోవైపు అమెరికా నుంచి వ్యవసాయ ఉత్పత్తుల్ని పన్నులు లేకుండా దిగుమతి చేసుకోవాలని, రష్యా నుంచి ఆయిల్ కొనుగోలు ఆపాలని షరతులు పెట్టడం అన్యాయమని మండిపడ్డారు. అమెరికా వీసాలకు నిబంధనలు కఠినతరం చేయడం, కాలపరిమితిని తగ్గించడం, జరిమానాలు విధించడం వంటి కారణాలతో ఎన్నో ఆశలతో ఉన్నత విద్యనభ్యసించిన విద్యార్థుల కలలు పేకమేడల్లా కూలిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే అమెరికాకు వెళ్లినవారి పరిస్థితి అగమ్యగోచరంగా ఉందన్నారు. కావున వెంటనే ట్రంప్ షరతులను తిప్పి కొట్టి, అమెరికాపై మోడీ ఒత్తిడి చేయాలని, లేకుంటే భవిష్యత్తులో దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టే పరిస్థితి ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి, సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, సిపిఐ జిల్లా నాయకులు ఆర్‌విఎస్ కుమార్, ఎస్.దుర్గా రావు, సిపిఐ(ఎంఎల్) జిల్లా నాయకులు పి.శ్రీను నాయుడు, భాస్కర్రావు, సిపిఐ(ఎంఎల్ లిబరేషన్ జిల్లా నాయకులు పి.సంఘం, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు పోల ఈశ్వరరావు, పోల రమణి, గిరిజన సంక్షేమ సంఘం జిల్లా కన్వీనర్ పాలక రంజిత్ కుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, కోశాధికారి గొర్లి వెంకటరమణ, కార్యదర్శి బి.వి.రమణ, ఉపాధ్యక్షులు రెడ్డి వేణు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రెడ్డి లక్ష్మునాయుడు, ఉపాధ్యక్షులు బంటు దాసు, సిఐటియు, ఐ.ఎఫ్.టి.యు పట్టణ నాయకులు బి.సూరిబాబు, రాగోలు సర్వేశ్వరరావు పాల్గొన్నారు.



పార్వతీపురంలో రాస్తారోకో చేస్తున్న వామపక్ష నాయకులు

కొమరాడ: భారత్ పై అమెరికా విధించిన సుంకాలను రద్దు చేయాలని సిపిఎం ఆధ్వర్యంలో కొమరాడలో ప్రజలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి మాట్లాడుతూ ఇండియా తో ఉన్న అన్ని ఒప్పందాలను ధిక్కరించి అమెరికా నుండి దిగుమతి అయ్యే మన సరుకులపై భారీగా ట్రంప్ పన్నులు పెంచేశాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ప్రధానమంత్రి మోడీ అసమర్థత పాలనకు నిదర్శనం అని అన్నారు. కార్యక్రమంలో ప్రజలు పాల్గొన్నారు .



సీతానగరంలో యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు

ఎరువుల కోసం బారులు

ప్రజాశక్తి మక్కువ

ఎరువుల్లో ప్రధానంగా యూరియా కొరత మండల రైతులను ఇబ్బందుల పాలు చేస్తోంది. 266 బస్తాల లోడు ఒక్కటి రావడంతో రైతులు క్యూలో పడిగాపులు కాయాల్సి వస్తుంది. ఒక రైతుకు ఆధార కార్డు ద్వారా ఒక బస్తా యూరియాను దుకాణదారులు విక్రయిస్తున్నారు. శనివారం మండల కేంద్రంలోని గ్రోమోర్ దుకాణానికి ఒక్క లోడ్ యూరియా రావడంతో రైతులు అక్కడ బారులు తీరారు. వ్యవసాయ శాఖ ఎఇఒ వెన్నెల దగ్గరుండి ఎరువులు సక్రమంగా విక్రయమయ్యేలా చూస్తున్నారు. ఎరువుల కొరత కారణంగా ఒక్కో లోడు మాత్రమే వస్తుందన్నారు. కోన, కవిరిపల్లి రైతు సేవా కేంద్రాలకు కూడా యూరియా నిల్వ అందుబాటులో ఉందని ఆమె చెప్పారు. డీసెర్లం రైతు సేవా కేంద్రానికి యూరియా ప్రతిపాదన పంపామన్నారు.

సీతానగరం : ఎరువుల కోసం రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ మేరకు శనివారం గ్రోమోర్‌లో యూరియా రైతుకు ఒకటి చొప్పున ఇవ్వడంతో క్యూలో నిలబడ్డారు. దీంతో గందరగోళం జరిగింది. ఈ పరిస్థితుల్లో ఎఒ అవినాష్ పోలీసుల సమక్షంలో రైతు ఆధార్ కార్డు, వన్ బి బయోమెట్రిక్ తీసుకొని ఒక్కొక్క బస్తా చొప్పున సరఫరా చేశారు. అలాగే కోట సీతారాంపురం, దయానిధి పురం, ఇప్పలవలస రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు యూరియా సరఫరా చేస్తున్నామన్నారు.

కార్మికులందర్నీ పర్మినెంట్ చేయాలి

12వ పిఆర్‌సి వెంటనే ప్రకటించాలి

మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

ప్రజాశక్తి - పార్వతీపురం

పురపాలక సంఘాలు, కార్పొరేషన్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ వర్కర్లందర్నీ రాష్ట్ర ప్రభుత్వం పర్మినెంట్ చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. యూనియన్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ సింహాచలం అధ్యక్షతన జరిగిన పార్వతీపురంలో జరిగిన సమావేశంలో యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 12వ పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని, పెరుగుతున్న నిత్యవసరాలు ధరలు కార్మిక వర్గాన్ని తీవ్ర ఇబ్బంది పెడుతున్నాయని, కావున వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం పని ప్రైవేటీకరణ, వర్క్ ఔట్సోర్సింగ్ విధానాలు వెంటనే మానుకోవాలని డిమాండ్ చేశారు. జూలైలో జరిగిన సమ్మె జీతం, గతంలో చేసిన 17 రోజుల సమ్మె సందర్భంగా సమ్మె కాలపు ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని కోరారు. కూటమి ప్రభుత్వం హామీ ప్రకారం కార్మికులందర్నీ పర్మినెంట్ చేసి హామీలు అమలు చేయకుంటే ఈనెల 18న రాష్ట్రవ్యాప్త ప్రదర్శనలు, ఎమ్మెల్యే, మంత్రులు అధికారులకు వినతి పత్రాలు, ఈనెల 20, 21, 22న విజయవాడలో దీక్షలు, 23న మహాధర్నా నిర్వహిస్తున్నామని తెలిపారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్ వై నాయుడు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై మన్మథరావు, కోశాధికారి వెంకటరమణ మాట్లాడుతూ జిల్లాలో చనిపోయిన కుటుంబాలందరికీ వెంటనే పాలకవర్గాలు ఉద్యోగాలు ఇవ్వాలని, జిల్లాలో బకాయి ఉన్న పర్మినెంట్ కార్మికుల పుట్టు ఖర్చులు, ఇంక్రిమెంట్ల బకాయిలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. పార్వతీపురం మున్సిపల్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు నాగవంశం శంకర్రావు వరదరాజు, శివ, రాజేష్, సిఐటియు ఎపట్టణ నాయకులు సూరిబాబు పాల్గొన్నారు.

విఆర్‌ఎలకు పే స్కేలు అమలు చేయాలి

విఒఆర్ఎలకు పేస్కేలు, డిఎతో కూడిన జీతం చెల్లించాలని సిఐటియు రాష్ట్ర నాయకులు కె.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. శనివారం విఆర్‌ఎల సంఘం జిల్లా అధ్యక్షుడు గరుగుబిల్లి ఈశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన విఆర్‌ఎల సమావేశంలో ఆయన మాట్లాడారు. రెవెన్యూ శాఖ పరిధిలో ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా పనిచేస్తున్న విఆర్‌ఎలకు గత ఏడేళ్ల నుంచి జీతాలు పెరగలేదన్నారు. కేవలం రూ.11000 జీతంతో కుటుంబాలు గడవక అవస్థలు పడుతున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విఆర్‌ఎల కష్టాలు తీరుతాయని ఆశించినా 14 నెలలు గడుస్తున్నా నేటికీ సమస్యలు పరిష్కారం కాలేదని చెప్పారు. కావున గ్రామ రెవెన్యూ సహాయకుల (వీఆర్‌ఏలు) న్యాయమైన డిమాండ్లు పరిష్కారం చేయాలని కోరారు. మన్యం జిల్లాలో ప్రమోషన్లు, ఖాళీగా ఉన్న అటెండర్, వాచ్మెన్, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు అర్హత కలిగిన వారిని ఎంపిక చేయాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం 23, 24 తేదీల్లో విజయవాడలో దీక్షలు చేపడతామని, 25న ధర్నా చేస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో విఆర్ సంఘం కార్యదర్శి ఏగోటి కృష్ణ, సుదర్శన, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మథరావు, ఎన్వై నాయుడు, శ్రీను, కష్ణ, సాంబ, బాబ్జీ, ఈశ్వరరావు, సూర్య నారాయణ, హైమ,తదితర విఆర్‌ఎలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ వర్కర్స్, హెల్పర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు

జిల్లా ఆస్పత్రిలో నీటి కొరత ఉండరాదు

ఆస్పత్రి అభివృద్ధి సంఘం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక జిల్లా ఆసుపత్రిలో నీటి కొరత ఉండరాదని, రానున్న వేసవి దృష్ట్యా ఇప్పటి నుంచే తగు చర్యలు చేపట్టాలని జిల్లా ఆసుపత్రి అభివృద్ధి సంఘం నిర్ణయించింది. ఈ మేరకు అదనంగా ఒక బోరు ఏర్పాటుకు, మున్సిపల్ లైను వేసేందుకు అంగీకారం తెలిపింది. జిల్లా ఆసుపత్రి అభివృద్ధి సంఘ సమావేశం కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అధ్యక్షతన జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం జరిగింది. జిల్లా ఆసుపత్రి అభివృద్ధి సంఘం ఆస్పత్రిలో చేపట్టిన అంశాలను, భవిష్యత్తులో చేపట్టాల్సిన కార్యాచరణను చర్చించింది. ఆసుపత్రికి కాలుష్య నియంత్రణ సర్టిఫికెట్ అవసరం ఉందని, ఇందుకు రూ.5.60 లక్షలు ఖర్చు అవుతుందని, దీన్ని ఎన్టీఆర్ వైద్య సేవ నిధుల నుండి మంజూరుకు అనుమతించింది. అలాగే వివిధ అభివృద్ధి పనులకు సంఘం అనుమతించింది. లిఫ్ట్ నిర్వహణ పట్ల ఎపిఎంఎస్ఐడిసి ఇంజనీర్లను ప్రశ్నించారు. ఆసుపత్రిలో ధోబీ, ఎలెక్ట్రీసియాన్ లను నియమించి ఇందుకు గల ఖర్చును ఎన్‌టిఆర్ వైద్య సేవ నిధుల నుంచి ఇవ్వడానికి అనుమతించారు. ఎస్‌టిపి ఏర్పాటుకు, కొత్తగా కడుతున్న మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో చేర్పులు మార్పులకు, మోడరన్ మార్చురీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని నిర్ణయించింది. రేడియాలజిస్ట్, ఎన్‌సిడి డాక్టర్, స్టాఫ్ నర్స్, రికార్డ్ అసిస్టెంట్ పోస్టులు భర్తీకి ప్రతిపాదనలు పంపించడం జరిగింది. కొత్తగా ఒపి రిజిస్ట్రేషన్ కౌంటర్లను ఏర్పాటుకు అనుమతించింది. జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాకట్ర్ శివ నాగ జ్యోతి ఆసుపత్రిలో చేపట్టబోయే అభివృద్ధి పనులను ఆమోదించాల్సి ఉందని కోరగా సభ్యులు ఆమోదం తెలిపారు. ఆసుపత్రి 150 పడకలు అయినప్పటికీ అవసరార్థం 250 పడకలు ఏర్పాటు చేశామన్నారు. రోజుకు వెయ్యి వరకు ఒపి నమోదవుతుందని చెప్పారు. జిల్లా ఆసుపత్రిలో సిఎస్‌ఆర్ నిధులతో బ్లడ్ కంపోనేంట్లు, సేపరేషన్ స్టోరేజ్‌ను చేశామన్నారు. జిల్లా ఆసుపత్రి ఎబిడిఎంలో ఉత్తమమైన సేవందిస్తూ రాష్ట్ర స్థాయిలో మొదటి స్థానంలో ఉందని వివరించారు. సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే బి.విజయచంద్ర, జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా.జి.నాగభూషణ రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఎస్ భాస్కరరావు, ఎపి ఎంఎస్ఐడిసి ఇఇ శ్రీదేవి, సభ్యులు పాల్గొన్నారు.



అన్నదాత పోరు వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న పరీక్షిత్‌రాజు, జోగారావు, వైసిపి నాయకులు

ఎరువుల సరఫరాలో ప్రభుత్వం విఫలం

వైసిపి జిల్లా అధ్యక్షులు పరీక్షిత్ రాజు

అన్నదాత పోరు వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ఖరీఫ్ సీజన్ సగం దాటినా రైతులకు అవసరమైన ఎరువులను సకాలంలో అందించడంలో టిడిపి ప్రభుత్వం ఘోరంగా విఫలమయిందని వైసిపి జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్తు రాజు విమర్శించారు. శనివారం జిల్లా వైసిపి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 9న ఆర్డీవో కార్యాలయాల వద్ద నిర్వహించనున్న అన్నదాత పోరుకి సంబంధించిన గోడ పత్రికలను ఆయన మాజీ ఎమ్మెల్యే జోగారావుతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైం దన్నారు. చెప్పారు. రైతులు, యువకులు , మహిళలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. రైతులు పండించే పంటలకు ఎరువులు కూడా అందించలేని దుస్థితిలో పరిపాలన వుందని పరీక్షిత్తు రాజు అన్నారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఇది రైతులకు వెన్నుపోటు ప్రభుత్వం :రాజన్నదొర

సాలూరు: రాష్ట్రంలో రైతులకు టిడిపి కూటమి ప్రభుత్వం వెన్నుపోటు పొడుస్తున్నదని మాజీ డిప్యూటీ సిఎం రాజన్నదొర ఆరోపించారు. తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వైసిపి నాయకులతో ఈనెల 9న ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద రైతుల మహాపోరుకు సంబంధించిన గోడ పత్రికలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఎన్నో అలవికాని హామీ లిచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత అందరికీ టిడిపి ప్రభుత్వం మొండిచేయి చూపిస్తోందని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు యూరియా కోసం నిద్రాహారాలు మాని కాపలా కాస్తున్నారని చెప్పారు. యూరియా బస్తా ప్రయివేటు వ్యాపారుల వద్ద రూ.400 నుంచి రూ.500 వరకు కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. గంటల తరబడి క్యూలైన్లలో నిలబడినా ఒక యూరియా బస్తాకు మించి పంపిణీ చేయడం లేదని చెప్పారు. ఎరువుల కొరత లేదని ఒకవైపు జిల్లా అధికారులు చెపుతున్నా వాస్తవ పరిస్థితి దీనికి భిన్నంగా ఉందని చెప్పారు. రైతు సేవా కేంద్రం, పిఎసిఎస్‌ల చుట్టూ తిరుగుతున్నా ఒక్క యూరియా బస్తా కూడా అందని పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. సమావేశంలో వైసిపి పట్టణ అధ్యక్షుడు వంగపండు అప్పలనాయుడు, ప్రచార విభాగం జిల్లా కన్వీనర్ గిరిరఘు, వైసిపి నాయకులు పిరిడి రామకష్ణ, ఎంఎస్ నారాయణ, హరి బాలాజీ, కౌన్సిలర్ జి.వెంకటరమణ పాల్గొన్నారు.

డ్వామా పీడీపై చర్యలు తీసుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ఉపాధి హామీ చట్టంలో అక్రమాలకు, అవినీతికి పాల్పడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వై మన్మథరావు, కార్యదర్శి బివి రమణ డిమాండ్ చేశారు. శనివారం సుందరయ్య భవనంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి కూలీల నుంచి ప్రతి వారం వంద రూపాయలు చొప్పున అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఇప్పటికే అనేక సందర్భాల్లో ఫిర్యాదులు చేసినప్పటికీ కనీస చర్యలు చేపట్టడం లేదని విమర్శించారు. ఉపాధి కూలీల మస్తర్లు, రికార్డులు కూడా ఇవ్వకుండా నెలకు రూ.10 లక్షలు స్వాహా చేస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిందని చెప్పారు. కనీసం జాబు కార్డులు కూడా ప్రభుత్వం ముద్రించి ఇవ్వకుండా ప్రైవేటు షాపుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లను కొనుక్కోమని చెప్పడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇతర జిల్లాల్లో స్టేషనరీ, జాబ్ కార్డులు ప్రభుత్వమే సరఫరా చేస్తున్నప్పటికీ మన్యం జిల్లాలో స్టేషనరీ సరఫరా చేయకుండా నిధులు స్వాహా చేస్తున్నారని, ఫీల్డ్‌అసిస్టెంట్లు 7 రికార్డులు నిర్వహించాలని, ఆ రికార్డులను సరఫరా చేయకుండా వారితోనే కొనిపిస్తున్నారని చెప్పారు. ఈ రకంగా స్టేషనరీ, రికార్డుల నిమిత్తం ప్రభుత్వం నుంచి వస్తున్న నిధులను కూడా స్వాహా చేసి అక్రమాలకు పాల్పడుతున్నారని, ఈ నిధులను కూడా జిల్లా అధికారులకు ముడుపులు చెల్లిస్తున్నట్లు కింద స్థాయి సిబ్బంది వాపోతున్నారని అన్నారు. పీడీ అక్రమాలపై అనేక ఫిర్యాదులు వస్తున్నప్పటికీ జిల్లా అధికారులు చర్యలు చేపట్టకపోవడం ఆశ్చర్యంగా ఉందని అన్నారు. ఇప్పటికే ఒకసారి బదిలీ అయినప్పటికీ ఆ బదిలీని అధికారులు ఎలా నిలిపివేశారని ప్రశ్నించారు. తన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు చిరుద్యోగులపై రికవరీలు విధించి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న పీడీని తక్షణమే బదిలీ చేయాలని, పిడి రామచంద్ర రావుపై ఎసిబి దర్యాప్తు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ అక్రమాలపై రాష్ట్ర గ్రామీణ, పంచాయతీరాజ్ శాఖ ఉన్నతాధికారులకు, ముఖ్యమంత్రికి సిఐటియు తరఫున ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ పాల్గొన్నారు.

నిర్మాణాలు పూర్తి చేయాలి

హెచ్.కారాడవలస లేఔట్‌ను పరిశీలించిన కలెక్టర్

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

గృహ నిర్మాణాలు త్వరగా పూర్తి చేయాలని, ఇందుకు సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. మండలంలోని హెచ్ కారాడవలస లేఔట్‌లో గల ఇళ్ల నిర్మాణాలను శనివారం కలెక్టర్ పరిశీలించారు. 181 గృహాల్లో కొద్ది గృహాలు మాత్రమే పూర్తిస్థాయిలో పనులు జరగడాన్ని పరిశీలించిన కలెక్టర్ అధికారులను ప్రశ్నించారు. లబ్ధిదారులతో మాట్లాడుతూ త్వరగా నిర్మాణాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వం అవసరమగు సహాయ సహకారాలు పూర్తి స్థాయిలో అందిస్తుందని, దీన్ని వినియోగించుకొని గృహ నిర్మాణాలను పూర్తి చేయడం వల్ల ఉపయోగం ఉంటుందన్నారు. కొద్ది రోజుల అనంతరం పథకం ముగుస్తుందని, తద్వారా అందాల్సిన సహాయక చర్యలు అందే అవకాశం ఉండకపోవచ్చని ఆయన చెప్పారు. అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించి వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో గృహ నిర్మాణ సంస్థ ఇన్చార్జి ప్రాజెక్ట్ డైరెక్టర్, కెఆర్‌ఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పి.ధర్మచంద్రా రెడ్డి, పార్వతీపురం ఎఫ్‌ఎసి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి ధనలక్ష్మి

సిహెచ్‌డబ్ల్యులను ఆశాలుగా మార్చాలి

ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆశా వర్కర్లతో సమానంగా పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్చాలని ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధనలక్ష్మి డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ఆశా వర్కర్లకు వయోపరిమితి, మెటాలిటీలీవ్, గ్రాడ్యుటిపై ప్రభుత్వం జీవో విడుదల చేసిందని, మన్యం జిల్లాలో ఇటీవల కాలంలో మరణించిన కె.విద్యావతి మక్కువ పిహెచ్.సి, ఎం.శాంతమ్మ మాదలంగి పిహెచ్.సి వర్కర్లకు పీఎంజజ్జివై ప్రకారంగా ఇన్సూరెన్స్ చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆశా వర్కర్లు గత 20 ఏళ్లుగా, కమ్యూనిటీ హెల్త్ వర్కర్లు 8 ఏళ్లుగా విధులు నిర్వర్తిస్తున్నారని, వీరికి ప్రభుత్వం నుంచి ఎటువంటి భద్రత లేకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా గిరిజన శాఖ మంత్రి గిరిజనుల కోసమే కూటమి ప్రభుత్వమని నిరంతర ఆర్భాట ప్రచారం ప్రకటనగానే నిలుస్తుందని విమర్శించారు. ప్రభుత్వం కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు అందిస్తున్న రూ.4వేల జీతంతో వెలకట్టలేనిదని, వారి శ్రమకు కృషికి చాలీచాలని వేతనంతో ప్రభుత్వం అవమానానికి గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కరోనా సందర్భంలో దీర్ఘకాలికంగా ప్రజల కోసమే శ్రమించారని, బాలింతల, గర్భిణీల కోసం ఎనలేని కృషిని ధారపోస్తున్నారని అటువంటి వారికి ప్రభుత్వం గుర్తించకపోవడం అన్యాయమని అన్నారు. ప్రభుత్వం ఆశా వర్కర్లకు జీవో విడుదల చేయడం హర్షించదగిన విషయమని, కానీ ప్రమాదవశాత్తు మరణించిన వర్కర్లకు ఎటువంటి భరోసా లేదని వెంటనే జీవో విడుదల చేయాలని, పెరిగిన జనాభాకు అనుగుణంగా ఆశా వర్కర్ల సంఖ్యను పెంచాలని, ఎఎన్ఎంలుగా ప్రమోట్ అవుతున్న వాళ్లని గుర్తించి ఆశాలుగా నియమించాలని, సుప్రీంకోర్టు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న తీర్పును కమ్యూనిటీ హెల్త్ వర్కర్లకు వర్తింపచేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ఆశాలకు జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. నేటి కూటమి ప్రభుత్వం గత ప్రతిపక్షంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని లేకుంటే భవిష్యత్తులో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో ఎపి ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వి.ఇందిరా, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.గౌరీశ్వరి, ఎం.శివాని, జిల్లా కోశాధికారి నిర్మల, యూనియన్ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

రవికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ఉపాధ్యాయ దినోత్సవం రోజు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు తెర్లి రవికుమార్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా మన్యం జిల్లా ఇంటర్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ వై.నాగేశ్వరరావు, అన్ని కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, స్నేహితులు, బంధువులు అభినందించారు. రవికుమార్ సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపిక చేయడం పట్ల శుభాకాంక్షలు తెలిపారు.



సీఎం చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న అధ్యాపకులు రవికుమార్

హెచ్ఎంకు విద్యార్థుల సన్మానం

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పనుకువలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నెల్లి సత్యం నాయుడుకు గురుపూజోత్సవం సందర్భంగా శనివారం శాలువాతో సత్కరించి సన్మానించారు. ఆయనతో పాటు ఉపాధ్యాయులు లక్ష్మిని కూడా సన్మానించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు గ్రామస్తులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయుడు సత్యంనాయుడును సన్మానిస్తున్న విద్యార్థులు

9న 5కె రెడ్ రన్

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎయిడ్స్, హెచ్ఐవి అవగాహనలో భాగంగా ఈనెల 9న 5కె రెడ్ రన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జిల్లా లెప్రోసి, ఎయిడ్స్, హెచ్ఐవి, టిబి నియంత్రణ అధికారి డాక్టర్ ఎం.వినోద్ కుమార్ తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 9న ఉదయం 6 గంటలకు శ్రీ వెంకటేశ్వర ప్రభుత్వ డిగ్రీ కళాశాల నుంచి రన్ ప్రారంభమై జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు కొనసాగుతుందని ఆయన చెప్పారు. ప్రజలంతా కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌కు అభినందనలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన రంజిత్ కుమార్ నాయక్‌ను ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి గుమ్మలక్ష్మీపురం క్యాంపు కార్యాలయంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్ పదవి ఇచ్చిన సందర్భంగా ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయిలో కష్టించి పనిచేసే వారికి పార్టీలో ఎల్లప్పుడూ గుర్తింపుతో పాటు మంచి పదవులు దక్కుతాయని, ఇటీవల కాలంలో నియోజకవర్గంలో పలువురు పొందిన పదవులే అందుకు నిదర్శనమని అన్నారు. పదవులు పొందిన ప్రతి ఒక్కరూ బాధ్యతతో పనిచేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ఉన్నారు.



సర్పంచి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న పుష్పశ్రీవాణి

సర్పంచ్‌కు పుష్పశ్రీవాణి పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని ఉదయపురం పంచాయతీ సర్పంచ్ బిడ్డిక అరుణ అత్త, వైసిపి నాయకుడు రాజారావు తల్లి ఇటీవల మరణించిన సంగతి తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పాముల పుష్ప శ్రీవాణి శనివారం కాకితాడలో గల వారి ఇంటి వద్దకు వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ఓదార్చి అన్ని విధాలా అండగా ఉంటామని ధైర్యాన్ని ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిపి శెట్టి పద్మావతి, జడ్పిటిసి సుజాత, మండల కన్వీనర్ ఐ.గౌరీశంకర్, వైస్ ఎంపిపి బి.అన్నాజీరావు, పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

రూ. 60 లక్షలతో జలజీవన్ మిషన్ పనులు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని లక్కగూడ (పివిటిజి)గ్రామానికి రూ.60 లక్షల20 వేలతో జల జీవన్ మిషన్ పనులు మంజూరైనట్లు ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ ఎన్.ప్రవీణ్ కుమార్ తెలిపారు. పనులకు సంబంధించి వాటర్ ట్యాంక్ నిర్మాణానికి లక్కగూడ పరిసర ప్రాంతంలో శనివారం స్థల పరిశీలన చేశారు. పనులు ప్రారంభానికి కాంట్రాక్టర్ ముందుకు వచ్చినట్లు తెలిపారు. జలజీవన్ మిషన్ పనులు పూర్తయితే పంచాయతీ పరిధిలో గిరిజన ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరందించడానికి వీలుంటుందని భావిస్తున్నారు. కార్యక్రమంలో కురుపాం మార్కెట్ కమిటీ చైర్మన్ కడ్రక కళావతి, సర్పంచ్ బిడ్డిక సూర్యారావు తదితరులు ఉన్నారు.

ప్రభుత్వమే వైద్య కళాశాల ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర ప్రభుత్వమే వైద్య కళాశాలలను ఏర్పాటు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పీపీపీ విధానంలో వైద్య కళాశాలలు ఏర్పాటు చేయాలనే కూటమి ప్రభుత్వం నిర్ణయం ఉపసంహరించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. పిపిపి విధానం వల్ల వైద్యం, వైద్య సేవలు, వైద్య, విద్య మరింత ఖరీదవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే బదిలీ అయినా డ్వామా పీడీని రిలీవ్ చేయాలన్నారు. మన్యం జిల్లాకు రెగ్యులర్ డిఇఒ, ఐటిడిఎకు డిడిని నియమించాలని డిమాండ్ చేశారు.

సర్వేపల్లి జీవితం.. ఆదర్శం

ప్రజాశక్తి- సాలూరు రూరల్

సర్వేపల్లి జీవితమే ఒక ఆదర్శవంతమైన జీవితమని విద్యార్థులు ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని హెచ్‌ఎం ఎల్.రాజమణి కోరారు. సర్వేపల్లి జయంతి సందర్భంగా బాగువలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం సర్వేపల్లి రాధాకృష్ణ జీవిత చరిత్రను, ఆయన జీవిత విశేషాలను విద్యార్థులకు వీడియో రూపంలో ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

శత శాతం హాజరయ్యేలా చూడాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

పాఠశాలకు శతశాతం విద్యార్థులు హాజరయ్యేలా చూడాలని ఎంఇఒ- 2 ఆర్.ఆనందరావు సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని సంధిమానుగూడ గిరిజన పాఠశాలను శనివారం ఆయన సందర్శించారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలన్నారు. మధ్యాహ్న భోజన పథకం కూడా సక్రంగా అమలు చేయాలన్నారు. అనంతరం రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయనతో పాటు ఉపాధ్యాయులు ఉన్నారు.

ఐదుగురికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

ప్రజాశక్తి - భామిని

మండలంలోని ఐదుగురు ప్రభుత్వ ఉపాధ్యాయులు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. ఉపాధ్యాయుల బిడ్డికి ప్రసాదరావు, ఎస్.రమేష్, ఎన్.రాజశేఖర్, అప్పన్న, మీసాల ప్రఫుల్ కుమార్ జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను శనివారం అందుకున్నారు. ఈ అవార్డులు చేసే వృత్తి పట్ల గౌరవం, చేయాలనే తపన కలిగిస్తాయని వారు తెలిపారు. వీరికి మండల విద్యాశాఖ అధికారి గేదెల శివకృష్ణ, పిఆర్‌టియు జిల్లా సెక్రెటరీలు రౌతు శ్రీరాములు, మండల శాఖ అధ్యక్షులు మజ్జి రమేష్, ఇతర ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై పిల్లలకు అవగాహన

ప్రజాశక్తి - గరుగుబిల్లి

గుడ్ టచ్ - బ్యాడ్ టచ్ పై పిల్లలకు తల్లిదండ్రులు అవగాహన కల్పించాలని రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్. దామోదరరావు అన్నారు. శనివారం స్థానిక బిఆర్ అంబేద్కర్ గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన న్యాయ అవగాహన సదస్సుకు జడ్జి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోక్సోచట్టం, గుడ్ -బ్యాడ్ టచ్ వంటి విషయాలను విద్యార్థులకు వివరించారు. పిల్లలు బయట ఎలా ప్రవర్తించాలి, అపరిచితుల పట్ల ఎటువంటి జాగ్రత్తలుతీసుకోవాలో విద్యార్థులకు సూచించారు. విద్యార్థినీ, విద్యార్థులు స్నేహితులుగా సోదరభావంతో మెలిగి దేశభక్తి కలిగి ఉండాలన్నారు. బాల్యవివాహాల వల్ల కలుగు నష్టాలు, సమస్యలు తెలియజేస్తూ వాటిని ప్రోత్సహించిన వారికి కఠినమైన శిక్షలు ఉంటాయన్నారు. లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టంపై వివరించారు. అమ్మాయిలకు ఎలాంటి ఇబ్బందికర పరిస్థితి తలెత్తినా అది కచ్చితంగా తల్లితో చెప్పాలని సూచించారు. మేం ఏం చేయలేమన్న నిస్సహాయ స్థితి నుంచి మేం ఏదైనా చేయగలమనే ధైర్యం ఆడపిల్లల్లో రావాలని పేర్కొన్నారు. మీకు అసౌకర్యం కలిగించిన దాని గురించి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు చెప్పాలని విద్యార్థినులకు సూచించారు. పిల్లల భద్రతపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు టి. జోగారావు, మాజీ అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ జి. వెంకటరావు, గరుగుబిల్లి సబ్ ఇన్స్పెక్టర్ ఫకద్దీన్, గురుకుల కళాశాల ప్రిన్సిపల్ రజని తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న రెండో అదనపు జిల్లా జడ్జి దామోదరరావు

బాలల రక్షణ కమిటీలు బలోపేతం కావాలి : ఎంపిపి

ప్రజాశక్తి - పాచిపెంట

మండల స్థాయిలో గల బాలల రక్షణ, సంక్షేమ కమిటీలు గ్రామస్థాయిలో బలోపేతం అవ్వాలని, పిల్లలు సంక్షేమం, సంరక్షణ సాధన నిమిత్తం కమిటీ సభ్యులు, అధికారులంతా పాటుపడాలని ఎంపిపి బి.ప్రమీల అన్నారు. స్థానిక ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి బాలల పరిరక్షణ, సంక్షేమ కమిటీ సభ్యులుచే, గ్రామ స్థాయి బాలల రక్షణ మరియు సంక్షేమ కమిటీ సభ్యులుకు, కమిటీ సభ్యులు విధి విధానాల పై శనివారం శిక్షణ నిర్వహించారు. ఎంపిడిఒ బివి జె పాత్రో మాట్లాడుతూ గ్రామస్థాయిలో గల గ్రామ సెక్రెటరీలు, రెవెన్యూ, మహిళా సంరక్షణ, ఆరోగ్య కార్యకర్తలంతా కలిసి బాలల కమిటీ సభ్యుల విధులు, బాధ్యతలు సక్రమంగా నిర్వహించాలన్నారు. సిడిపిఒ బి.అనంతలక్ష్మి మాట్లాడుతూ మండలంలోని పంచాయతీ స్థాయి బాలలు రక్షణ, సంక్షేమ కమిటీలన్నీ సక్రమంగా బాధ్యతలు విధులు నిర్వహించాలని, కమిటీ సభ్యులంతా సమన్వయంతో పిల్లలు రక్షణకై పాటుపడాలని అన్నారు. బాల్య వివాహాలు వల్ల నష్టాలపై అవగాహన కల్పించాలన్నారు. బడిబయట ఉన్న పిల్లలు గుర్తించి, వారు మళ్లీ విద్య కొనసాగించేందుకు, గ్రామాల్లో ఉన్న బాలబాలికలు ఎలాంటి బాలల హక్కులను పరిరక్షించాలని, బాల్య వివాహాలు జరగకుండా నివారణ చేయాలని అన్నారు. శిక్షణలో పలువురు సర్పంచులు, సెక్రటరీలు, సచివాలయం మహిళా సంరక్షణ అధికారులు, ఎఎన్ఎం, ఐసిడిఎస్ సూపర్వైజర్లు, జిల్లా బాలలు సంరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్ ప్రసాదరావు, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎన్ఐసి - ఎంఎ నాయుడు, సోషల్ వర్కర్ దేవి, శిశు గృహ సోషల్ వర్కర్ వర్కర్ అల్లు రమ్య, ఔట్ ఇచ్ వర్కర్ అనిల్, ఐసిడిఎస్ సిబ్బంది

పండుటాకులకు అందని రేషన్

ప్రజాశక్తి -కురుపాం

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకుని వికలాంగులకు, వృద్ధులకు, దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్దకే రేషన్ అందించాలని ఆశయాన్ని గ్రామ స్థాయికి వచ్చేసరికి అధికారులు తూట్లు పొడుస్తున్నారు. మండలంలో ఉదయపురం పంచాయతీ కాకితాడకు చెందిన మండంగి మొగ్గరావు, సావిత్రమ్మ దంపతులకు ప్రభుత్వం ఇంటి వద్దకే రేషన్ ఇమ్మంటున్నా ఇక్కడ జిసిసి సిబ్బంది మాత్రం ఇవ్వలేదు. మాలాంటి వృద్ధులకు రేషన్ తెచ్చే నాథుడే లేడని, రేసన్ కోసం మూడు కిలోమీటర్ల దూరం నడిచి ఉదయపురం జిసిసి గోడౌన్‌కు వెళ్లి, అక్కడ గంటలు తరబడి నిరీక్షించి రేషన్ తెచ్చుకోవలసిన పరిస్థితి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.కావున ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి మాలాంటి వృద్ధులకు, వికలాంగులకు, దీర్ఘకాలిక పేషెంట్లకు ఇంటి వద్దకే రేషన్ అందించేలా చూడాలని కోరుతున్నామన్నారు.



రేషన్‌కు నోచుకోని వృద్ధులు

రైతులకు మెరుగైన సేవలే లక్ష్యం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మార్కెట్ కమిటీల ద్వారా రైతులకు మెరుగైన సేవలు లక్ష్యంగా అంతా పనిచేయాలని ఎమ్మెల్యే బి.విజయ్‌చంద్ర సూచించారు. స్థానిక ఎఎంసి కార్యాలయంలో శనివారం సాయంత్రం మార్కెట్ కమిటీ అధ్యక్షులు గొట్టాపు గౌరీ అధ్యక్షతన సర్వ సభ్య సమావేశం జరిగింది. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేసి మరింత మెరుగైన సేవలు అందించేందుకు దృష్టి సారించిందన్నారు. ప్రభుత్వ ఆశయం నెరవేరేల కార్యవర్గ సభ్యులు రైతులు సంక్షేమానికి కృషి చేయాలన్నారు. మార్కెట్ కమిటీ నూతన కార్యాలయ భవనం, చైర్‌పర్సన్ చాంబర్, కార్యాలయం ప్రహరీ గోడ నిర్మాణం, తదితరఅభివద్ధి పనులకు తీర్మానం చేశారు.కార్యక్రమంలో వైస్ చైర్మన్ రౌతువేణు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఖైదీలతో మాట్లాడుతున్నడిఎస్‌పి రాంబాబు

వాట్సాప్ మనమిత్ర సేవలపై అవగాహన

ప్రజాశక్తి - కొమరాడ

రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మరింత సేవలు సక్రమంగా అందించేందుకు ఏర్పాటు చేస్తున్న వాట్సప్ మనమిత్ర సేవలపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలని ఎంపిడిఒ ఎస్.రమేష్ అన్నారు. శనివారం కొమరాడ, గుమడ సచివాలయల్లో గుడ్ గవర్నెన్స్‌లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించాల్సిన కార్యక్రమాలపై పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వాట్సాప్ మన మిత్ర ద్వారా ప్రజలకు 709 సర్వీస్‌లను అందిస్తుందన్నారు. ప్రజల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ సేవలను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. గ్రామాల్లో ఎటువంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తారని తెలిపారు. ఇటీవల కుడుస్తున్న వర్షాలు నేపథ్యంలో అపారిశుధ్యం ఎక్కువగా ఉందని, కావున కాలువల్లో పూడికల తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ప్రతి గ్రామ వీధుల్లోనూ పరిశుభ్రంగా ఉంటూ రోగాల బారిన ప్రజలు పడకుండా జాగ్రత్తలు వహించాలని తడి చెత్త పొడి చెత్తను వేరువేరుగా పారిశుద్ధ కార్మికులకు అందించాలని కోరారు.

కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ రాధాకృష్ణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సబ్ జైలును సందర్శించిన డిఎస్‌పి

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక సబ్ జైల్‌ను డిఎస్‌పి ఎం.రాంబాబు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన జైలు ఆవరణను క్షుణ్ణంగా పరిశీలించారు. వంట గదిని పరిశీలించారు. ఇక్కడ వంట ఖైదీలే చేస్తారా అని సూపరింటెండెంట్ బి.జోగులును అడగ్గా, వారే వంట చేస్తారని, ఆ సమయంలో ఒక గార్డ్‌ను డ్యూటీ వేస్తామని చెప్పారు. ఇటీవల పలుచోట్ల జరుగుతున్న సంఘటనలను దృష్టిలో పెట్టికొని విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సూపరింటెండెంట్‌కు సూచించారు. పోలీస్‌గార్డ్‌లు ఎంత మంది ఉన్నారని ఎఎస్సై శ్రీనివాసరావును అడిగి తెలుసుకున్నారు. ముఖ్యం చర్చ గేట్ తలుపు ఎప్పుడూ మూసివేసి ఉంచాలన్నారు ఖైదీలు ఓపెన్‌లో ఉన్నప్పుడు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జైలు సిబ్బందికి సూచించారు.

ఖైదీల ప్రవర్తన పట్ల డేగ కన్ను వేయాలి

ఖైదీల ప్రవర్తన పట్ల డేగ కన్ను వెయ్యాలని జైలు శాఖ జిల్లా అధికారి కె.మోహన్‌రావు అన్నారు శనివారం స్థానిక సబ్ జైలును ఆయన తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. జైలు ఆవరణ ఆయుధాలు ఉంచరాదన్నారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు ఖైదీలు ఓపెన్‌లో ఉండేటప్పుడు గేట్లు మూసివేయాలన్నారు. విధి నిర్వహణలో బాధ్యతగా ఉండాలని జైలు సూపరింటెండెంట్ జోగులుకు సూచించారు.

న్యూట్రిషన్ కిట్లు అందజేత

ప్రజాశక్తి - సాలూరురూరల్

జాతీయ పౌష్టిక ఆహార వారోత్సవాల్లో భాగంగా శనివారం నాడు దీక్ష మహిళా వెల్ఫేర్ ఆధ్వర్యంలో బాలింతలకు, గర్భిణీలకు పౌష్టిహార కిట్లను విశాఖ పట్నానికి చెందిన లీ ఫార్మా కంపెనీ సభ్యులచే అందజేశారు. ఈ సందర్భంగా లీ ఫార్మా కంపెనీ డైరెక్టర్ లీలారాణి మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలకు వారికి అవసరమైన ఆరోగ్యకరమైన న్యూట్రిషన్ కిట్లను అందజేయడానికి తమ సంస్థ ఎప్పుడు సిద్ధంగా ఉంటుందన్నారు. వారికి పుట్టబోయే బిడ్డలు సంపూర్ణమైన ఆరోగ్యంతో ఉండాలని తమ సంస్థ ఇటువంటి కార్యక్రమాలను నిర్వహిస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ వారి ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకొని ఎప్పటికప్పుడు వారికి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చూసే బాధ్యత స్థానిక అంగన్వాడీ కార్యకర్తలపై ఉందన్నారు. అనంతరం 200 మంది బాలింతలు, గర్భిణీలకు న్యూట్రిషన్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో దీక్ష మహిళా వెల్ఫేర్ డైరెక్టర్ ఎల్.శాంతి, సిడిపిఒ మంగమ్మ, సూపర్వైజర్లు అనురాధ, లీలావతి, ధనలక్ష్మి, ధరణి సభ్యులు భీమారావు, వెంకటరమణ బాలింతలు, గర్భిణీలు పాల్గొన్నారు.

తాగునీటి సౌకర్యం కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - కురుపాం

మండలంలోని జి.శివడ పంచాయతీలో గల నాంద్రగండ, కోటకొండ గిరిజన గ్రామాలు ప్రజలు ఎమ్మెల్యే తోయక జగదీశ్వరిని శనివారం గుమ్మలక్ష్మీపురంలో గల తన క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన ప్రజాదర్బార్‌లో కలసి సిసి రోడ్డు, తాగునీటి సదుపాయం కల్పించాలని వినతిపత్రం అందించారు. అలాగే జి.శివడలో గల ఆరోగ్య ఉప కేంద్రానికి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులకు ఫోన్ చేసి గిరిజన గ్రామాలకు తాగునీటి సదుపాయం కల్పించి, సిసి రహదారులు నిర్మాణం చేపట్టలని అన్నారు. అలాగే ఆరోగ్య ఉప కేంద్రానికి మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఎ.మనోషి, కువ్వారు, మాలయ్య, తుంబన్న, బాలరాజు, మల్లేష్, రాజేష్, గోజారు, మచ్చయ్య, మహేష్ తదిదరులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : ప్రజల కోసమే ప్రజా దర్బార్ నిర్వహణ, కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన వస్తుందని, ప్రజల నుంచి వస్తున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వెంట వెంటనే పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్ కార్యక్రమానికి గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియమ్మ వలస, గరుగుబిల్లి, కొమరాడ మండలాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి తమ సమస్యలను విన్నవించారు. భూ సమస్యలు పరిష్కరించాలని, పక్కా గృహాలు మంజూరు చేయాలని, సిఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేసి తమను ఆదుకోవాలని ఎమ్మెల్యేకు వినతులు ఇచ్చారు. అలాగే కురుపాం కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కడ్రక కళావతి, అరకు పార్లమెంటు అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రంజిత్ కుమార్ నాయకో, యువ గళం అధికార ప్రతినిధి కోలా రంజిత్ కుమార్, గుమ్మలక్ష్మీపురం, కురుపాం మండలాల కన్వీనర్లు అడ్డాకుల నరేష్, కెవి కొండయ్య తదితరులు ఉన్నారు.



ఫోన్‌లో అధికారులకు సమస్యలను వివరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

వ్యాధులను గుర్తించేందుకే ఆరోగ్య సర్వేలు

ప్రజాశక్తి -పార్వతీపురంటౌన్

వ్యాధి లక్షణాలున్న వారిని క్షేత్రస్థాయిలోనే గుర్తించేందుకు ఆరోగ్య సర్వేలు పక్కగా నిర్వహించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించిన ఎన్సీసీ4.0 శిక్షణా కార్యక్రమంలో డిఎంహెచ్ఒ పలు సూచనలు చేశారు. వ్యాధి ప్రబలక ముందే అనుమానిత లక్షణాలను సత్వరమే గుర్తించి తగు చికిత్స అందించాలని, ఇదే లక్ష్యంగా ఆరోగ్య సర్వేలు చేపట్టాలని పేర్కొన్నారు. తద్వారా చికిత్స మరింత సులభతరమై వ్యాధి తీవ్రత చెందకుండా జాగ్రతపడవచ్చున్నారు. త్వరలో చేపట్టబోయే ఎన్సిడి4.0 సర్వేలో దీర్ఘకాలిక వ్యాదుల గుర్తించాలని, ముఖ్యంగా క్యాన్సర్ లక్షణాలను సకాలంలో గుర్తించడమే లక్ష్యంగా ఉండాలన్నారు. గ్రామీణ, పట్టణ వైద్య సేవలు, గర్భిణీ వివరాలు ఎప్పటికప్పుడు హెచ్ఎమ్ఐఎస్ లో పొందుపర్చాలన్నారు. స్వర్ణాంధ్ర ప్రగతి నివేదికలను నిర్దేశించిన పోర్టల్ లో నమోదు చేయాలన్నారు. ఎన్‌సిడి జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు కార్యక్రమంలో మాట్లాడుతూ అసంక్రమిత వ్యాధులను గుర్తించడంలో జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే లక్ష్యాలను చేరాలని, అందుకు శిక్షణలో తెలియజేసిన అంశాలను పక్కగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎపిడెమియాలజిస్ట్ డా.సూర్య కౌశిక్, డెంటల్ సర్జన్ డా రమ్య,డిపిఓ లీలారాణి, డెమో సన్యాసిరావు, సూపర్వైజర్ విజయలక్ష్మి, ఆశా నోడల్ అధికారులు, డిఇఒ తాజ్, సిహెచ్ఒలు, ఎఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీ ప్రాంతంలో విద్యాబోధన మెరుగుకు ఉపాధ్యాయులు అంకితభావంతో కష్టించి పని చేయాలని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. స్థానిక బిఎస్సార్ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయ దినోత్సవం వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గ్రతం కంటే పాఠశాలల్లో మౌలిక వసతులు బాగా మెరుగుపడ్డాయని విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. ప్రముఖ రచయిత గంటెడు గౌర నాయుడు సిద్ధాంతాల పుస్తకాన్ని ఎమ్మెల్యే విడుదల చేశారు. ఎమ్మెల్యే దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఇఒలు చంద్రశేఖర్, బిడ్డిక బీముడు, టిడిపి మండల కన్వీనర్ అడ్డాకుల నరేష్ , బిజెపి నాయకులు నిమ్మక సింహాచలం, పలువురు రిటైర్డ్ ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నిర్మాణ కార్మికుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి - వీరఘట్టం

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం స్థానిక తహశీల్దార్ ఎఎస్ కామేశ్వరరావుకు వినతి పత్రం కార్మికులు అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ ఎన్ ప్రసాదరావు మాట్లాడుతూ బిల్డింగ్ వర్కర్స్ హెల్పర్స్ బోర్డుని పునర్దించాలని, పెండింగ్‌లో ఉన్న క్లైమ్లను తక్షణమే నిధులు చెల్లించాలని, 1234 మెమోను రద్దుచేసి కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్‌చేశారు. భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు స్కాలర్‌షిప్లు ఇవ్వాలని, ఇతర అంశాలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మికులు పిన్నింటి దుర్గారావు, వై.ప్రసాదరావు, బి.రాము, తదితర కార్మికులు పాల్గొన్నారు.

దోనుబాయిలో బాబు ష్యూరిటీ -మోసం గ్యారెంటీ

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని దోనుబాయిలో బాబు షూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం సర్పంచ్ కూరంగి వెంకినాయుడు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వెంకి నాయుడు మాట్లాడుతూ ప్రజా సమస్యలను కూటమి ప్రభుత్వం గాలికి వదిలేసిందని విమర్శించారు. గ్రామాల్లో రహదారులు, గృహాలు, తాగు, సాగునీరు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇచ్చిన హామీలను అమలు చేసేంత వరకు ప్రజల తరపున పోరాటం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు కోటేశ్వరరావు, మండంగి కేశవరావు, ప్రసాదరావు, సూరయ్య, నిమ్మక కైలేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మలుపు వద్ద లారీ బోల్తా

ప్రజాశక్తి - కొమరాడ

స్థానిక పోలీస్ స్టేషన్ సమీపాన గల మలుపు వద్ద బొగ్గు లారీ అదుపుతప్పి బోల్తాపడింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం శుక్రవారం రాత్రి విశాఖ నుంచి రాయపూర్ వైపు వెళ్తున్న బొగ్గు లారీ మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవం, క్లీనర్‌కు స్వల్ప గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. చికిత్స కోసం స్థానిక పిహెచ్‌సికి తరలించారు. ఆ మలుపు వద్ద నిత్యం ప్రమదాలు జరుగుతున్నట్లు స్థానికులు తెలిపారు. రాత్రి సమయంలో లారీ బోల్తాపడడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానిక ప్రజలు తెలిపారు. పోలీస్ స్టేషన్ సమీపంలో ఉన్న ఈ భారీ మలుపు వద్ద స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు పెట్టకపోతే భవిష్యత్తులో అనేక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని వాహనదారులు అంటున్నారు.

520 బస్తాల పిడిఎస్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి - పాచిపెంట

అక్రమంగా తరలిస్తున్న 520 బస్తాలు (26 టన్నులు) పిడిఎస్ బియ్యం విజిలెన్స్ అధికారులు శనివారం స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ అధికారులు అందించిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని పి.కోనవలస చెక్‌పోస్ట్ వద్ద శనివారం విజిలెన్స్ సిఐ సింహాచలం, ఎస్సై, సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ హేమలత కలిసి తుని నుంచి ఒడిశా వెళ్తున్న లారీని తనిఖీ చేయగా లారీలో 26 టన్నులు (520 బస్తాలు) పిడిఎస్ బియ్యంగా గుర్తించినట్టు తెలిపారు. ఈ బియ్యం కాకినాడ జిల్లా అల్లిపూడి నుంచి ఒడిశాలోని నుగాన్ గ్రామానికి అక్రమంగా తరలిస్తున్నట్లు తెలిపారు. పట్టుబడ్డ బియ్యం బస్తాలను మంచాడవలస డిపోలో ఉంచి లారీని పాచిపెంట పోలీస్ స్టేషన్‌కు అప్పజెబుతున్నట్టు విజిలెన్స్ సిఐ సింహాచలం తెలిపారు. ఇదే ఏడాది జూలై 12న కొత్తూరు మండలం కడుమ నుంచి ఒడిస్సా రాష్ట్రం నవరంగ్‌పూర్‌కు అక్రమంగా తరలిస్తున్న 700 బస్తాలు (సుమారు 35 టన్నులు) పిడిఎస్ బియ్యం విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు.



అధికారులు పట్టుకున్న పిడిఎస్ బియ్యం

చూపు లేని వారికి వెలుగునివ్వండి

జిల్లా ఆసుపత్రి నేత్ర వైద్య నిపుణులు వెంకటేష్

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

నేత్రదానం చేసి చూపు లేని వారికి చూపులు ప్రసాదించండి అని జిల్లా ఆసుపత్రి నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ వెంకటేష్ అన్నారు. శనివారం స్థానిక జిల్లా ఆసుపత్రి నేత్ర వైద్య విభాగంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్యాధికారి జీరు నగేష్ రెడ్డి ఆధ్వర్యంలో నేత్రదాన ప్రాముఖ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ కార్నియల్ అంధత్వంతో చూపు కోల్పోయిన వారికి నేత్ర దాతల నుంచి సేకరించిన కార్నియా మార్పిడి ద్వారా కంటి చూపును ప్రసాదించవచ్చునని తెలిపారు. కావున ప్రజలంతా అవగాహన కల్పించుకొని నేత్ర దానానికి ముందుకు రావాలని కోరారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ నేత్ర వైద్య అధికారి జీరు నగేష్ రెడ్డి మాట్లాడుతు వ్యక్తి మరణానంతరం ఆరు గంటల్లో నేత్రాలను సేకరించాల్సి ఉంటుందన్నారు. మరణానంతరం దాత తలకింద తలగడ వుంచి రెండు కళ్లను మూసివేసి నీటిలో ముంచిన తడిదూది గానీ, గుడ్డ గానీ పైన ఉంచాలని సూచించారు. అనంతరం నేత్ర నిధికి గానీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో గాని తెలియపర్చి కార్నియాలు సేకరించినపుడు సహకారం ఇవ్వాలని అన్నారు. ఈనెల 8 వరకు నేత్ర దాన పక్షోత్సవాలు వైద్య ఆరోగ్యశాఖ ద్వారా నేత్రాలను సేకరించేందుకు అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించి ప్రజలను చైతన్యపరుస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నేత్ర వైద్య అధికారి కృష్ణారావు, జిల్లా ఎన్‌జిఒ అధ్యక్షులు కిషోర్, శిక్షణా సిబ్బంది పాల్గొన్నారు.

జంఝావతిని పూర్తి చేయాలని ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి- పార్వతీపురం టౌన్

ఒరిస్సా ప్రభుత్వ అభ్యంతరాల పరిష్కారానికి రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవాలని కోరుతూ శనివారం జంఝావతి సాధన సమితి అధ్యక్షులు చుక్క భాస్కరరావు ఆధ్వర్యంలో ప్రధాన కార్యదర్శి పల్లి రాజగోపాల్ నాయుడు, సభ్యులు వారణాసి శ్రీహరి, చుక్క చందర్రావు, పాలక రంజిత్ కుమార్ తదితరులు స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్ చంద్రని కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఐదు దశాబ్దాలుగా పూర్తికాని జంఝావతి ప్రాజెక్ట్ పెండింగ్ పనులను పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు మేడిశెట్టి బాలు, మంత్రపూడి వెంకటరమణ, మంత్రపూడి చిరంజీవి, మాన్యం రామకృష్ణ, బూరగాన రంగారావు, నెల్లి లక్ష్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒకు డ్వామా ఎపిడిగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

స్థానిక ఎంపిడిఒ పి.తివిక్రమరావుకు పార్వతీపురం మన్యం జిల్లా డ్వామా ఎపిడిగా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు ప్రభుత్వం నుంచి అధికారిక ఉత్తర్వులు వచ్చాయి. ఆయనకు డిప్యూటీ ఎంపిడిఒ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.